

రక్షణ కల్పించాలి



రోగుల ప్రాణాలు కాపాడాలనే సదుద్దేశంతో సేవలందించే వైద్యులు, వైద్యసిబ్బందికి దాడుల నుంచి భద్రత కల్పించాలి. అందుకు ప్రత్యేక ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి. దీనికి సామాజిక అవగాహన అవసరం. ఆడ, మగ పిల్లలకు చిన్నతనం నుంచి బ్యాడ్, గుడ్ టచ్‌లతో పాటు సెక్స్ ఎడ్యుకేషన్ అందించాలి. అప్పుడు అత్యాచారాలు అరికట్టడానికి కొంత అవకాశం ఉంటుంది. వైద్య వృత్తిలో రోగి ప్రాణం పోయేలా ఎవరూ వ్యవహరించరు. అనివార్య పరిస్థితుల్లో రోగులు మరణిస్తే దాడులకు తెగబడటం సమంజసం కాదు. ఈ తరహా దాడులకు అరికట్టడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేయాలి. తక్షణం స్పందించేలా చర్యలు చేపట్టాలి.

–సీహెచ్ సాయిగీత, వైద్యాధికారి, పీహెచ్‌సీ, హిరమండలం

రక్షణ కరువైంది



మెట్టూరు పీహెచ్‌సీలో సిబ్బందికి రక్షణ కరువైంది. పాత గ్రామ పంచాయతీ కార్యాలయములో పీహెచ్‌సీని నిర్వహిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు లేవు. సెక్యూరిటీ గార్డులను నియమించక పోవడంతో భద్రత కరువైంది. ఊరుకు దూరంగా ఉన్నందున సెక్యూరిటీ గార్డులను నియమించాలి.

–పి.ప్రభ, స్టాఫ్‌నర్స్, మెట్టూరు పీహెచ్‌సీ, కొత్తూరు మండలం

మద్యం సేవించే రోగులతో ఇబ్బంది



మద్యం తాగి కొంతమంది వైద్యం కోసం వస్తున్నారు. అటువంటి వ్యక్తులతో ఇబ్బందిగా ఉంటుంది. అలాంటి వారికి వైద్య సేవలు అందించడం కూడా ఇబ్బందే. ఏం మాట్లాడుతారో తెలియని పరిస్థితి.

–కె.స్నేహ, వైద్యురాలు, కొత్తూరు సీహెచ్‌సీ

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



మద్యం దుకాణం వద్ద నిరసన తెలియజేస్తున్న సిబ్బంది

పాతపట్నం: ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది కోరారు. ఈ మేరకు పాతపట్నంలోని అంతరాబ రహదారిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద శుక్రవారం ప్లకార్డులతో కొంతసేపు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 15 వేలమంది ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కొన్నేళ్లు పనిచేస్తున్నామన్నారు. తమకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ నుంచి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ చేయనుందన్నారు. నిరసన తెలిపిన వారిలో సోమేష్, రాము, రమారావు, సతీష్ పాల్గొన్నారు.

పాఠశాల క్రీడలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దాలినాయుడు

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల తొమ్మిదో తేదీ నుంచి పాఠశాల క్రీడలు నిర్వహించనున్నామని వీటిని సమన్వయంతో విజయవంతం చేయాలని నరసన్నపేట ఎంఈవో పేడాడ దాలినాయుడు కోరారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో పీఈటీలు, పీడీలతో సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల, నియోజకవర్గ స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడాశక్తి పెంచడం, ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి మరింతగా శిక్షణ ఇచ్చేందుకు ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. సమావేశంలో మండలంలోని 12 ఉన్నత పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి గ్రిగ్స్ పోటీలు



మాట్లాడుతున్న ఎంఈవోలు

కొత్తూరు: మండల స్థాయి గ్రిగ్స్ పోటీలను సెప్టెంబర్ పది నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు, గోవిందరావులు చెప్పారు. స్థానిక ఎంఆర్‌సీలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అండర్–13, అండర్–17 విభాగాల్లో బాల బాలికలకు కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

అదుపుతప్పిన బోలేరో వాహనం



డివైడర్‌పై దూసుకుపోయిన బొలేరో వాహనం

నరసన్నపేట: జాతీయ రహదారిపై మండల పరిధిలోని జదూరు కూడలి సమీపంలో చెరుకు లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం అదుపు తప్పి డివైడర్‌పైకి ఎక్కింది. టైర్ పంచర్ కావడంతో వాహనం అదుపు తప్పింది. ఆ సమయంలో బోలేరో వాహనం ముందు రెండు ద్విచక్ర వాహనాలు ఉండగా వాటిని తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించిన నేపథ్యంలో ప్రమాదం చోటు చేసుకుంది. బొబ్బిలి సమీపంలోని కారాడ నుంచి ఇచ్ఛాపురానికి చెరుకు లోడుతో వాహనం వెళ్తునంది. డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

ఆమదాలవలస: గాజులకొల్లివలస గ్రామం సమీపంలో జగనన్న కాలనీలో ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు కేటాయించిన గృహాలను ఏపీడీ పంచాది రాధ శుక్రవారం పరిశీలించారు. గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. హౌసింగ్ ఏఈ మోహన్‌రావు ఉన్నారు.

నెరవేరని లక్ష్యం!



వృథాగా ఉన్న బప్పడాం చెత్త సంపదకేంద్రం

- వృథాగా చెత్తసంపద యూనిట్లు!

సరుబుజ్జిలి: చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయడం వలన పారిశుధ్యం క్షీణిస్తోంది. ఫలితంగా అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ సమస్య నుంచి ప్రజలను కాపాడేందుకు, పారిశుధ్య పరిరక్షణలో భాగంగా గత ప్రభుత్వం ఎంతో సదాశయంతో చెత్త నుంచి సంపద తయారీ యూనిట్ల (ఎస్‌డబ్ల్యూపీసీ)ను ఏర్పాటు చేసింది. అయితే వాటి నిర్వహణపై ప్రస్తుతం ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడంలేదు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో 110 పంచాయతీల్లో 108 చెత్తసంపద తయారీ కేంద్రాలు మంజూరు చేశారు. వీటిలో 80 కేంద్రాల నిర్మాణాలు పూర్తిచేశారు. ఒక్కోయూనిట్‌కు సుమారు రూ. నాలుగు లక్షల నుంచి తొమ్మిది లక్షల రూపాయల వరకు జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరుచేసి నిర్మాణాలు చేశారు.

ఖాళీగాషెడ్డులు

గ్రామాల్లో తడి, పొడి చెత్తనుసేకరించి సంపద కేంద్రాలకు తరలించి వాటికి కేటాయించిన షెడ్డుల్లో వేర్వేరుగా వాటిని గ్రీన్‌అంబాసిడర్లు నిల్వచేయాలి. అయితే చాలా పంచాయతీల్లో షెడ్డుల్లో చెత్త నిల్వచేయక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఎప్పటిలాగానే చెత్త రహదారులు పక్క వేయడంవలన వర్షాల కారణంగా దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు.

నిర్వహణ కరువు

మూలసవలాపురం, బప్పడాం, యరగాం, దకరవలస,పెద్దపాలెం గ్రామాల్లో నిర్మించిన కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేకపోయింది. నిధులు ఖర్చు తప్పితే ఎటువంటి ప్రయోజనంలేదని స్థానికులు చెబుతున్నారు.

రోగాలు ప్రబలుతున్నాయి



గ్రామాల్లో చెత్తను సక్రమంగా సేకరించడం లేదు. దీంతో పారిశుధ్యం క్షీణించి రోగాలు ప్రబలుతున్నాయి. యూనిట్లు నిర్మించిన తరువాత వాటి నిర్వహణ కూడా సక్రమంగా చేయాలి. వీటి నిర్వహణపై దృష్టిసారించాలి

–గదిలి రమణమూర్తి, తురకపేట, సరుబుజ్జిలి మండలం

అధికారుల పర్యవేక్షణ కరువు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించిన తరువాత అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. వాటి పర్యవేక్షణపై ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో జీతాల్లేక వారు ఇబ్బందులు పడుతున్నారు.

–బద్రి రామారావు, పెద్దసవలాపురం, సరుబుజ్జిలి మండలం

పర్యవేక్షణ చేస్తున్నాం

చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. రోజూ పంచాయతీల వారీగా కేంద్రాల పర్యవేక్షణ చేస్తున్నాం.

–ఆనందరావు, ఈవోపీఆర్డీ, సరుబుజ్జిలి

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హిరమండలం: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్నరాణి అన్నారు. స్థానిక కేజీబీవీలో బాలికల రక్షణపై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం నినాదంతో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లలను చదివించడంతో పాటు వారి స్వీయ రక్షణ కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సురక్షిత, స్పర్శ, సైబర్‌నేరాలు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమరవాణా, అత్యాచారాలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలు, మహిళలకు ఇబ్బందులు ఉంటే 100, 1098, 181, 112 హెల్ప్ లైన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. ఆపద సమయంలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తంగా వన్‌స్టాప్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎస్.కృష్ణవేణి ఉన్నారు.

తరుగు లేకుండా చర్యలు



గోదాంను తనిఖీ చేస్తున్న డీటీ కిశోర్‌కుమార్

సరుబుజ్జిలి: రేషన్‌డిపోలకు సరఫరా చేసే బియ్యం బస్తాల్లో తరుగులు లేకుండా తూకంవేసి అందజేస్తామని మండల పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ బగాది కిశోర్‌కుమార్ తెలిపారు. 'గోదాం సరకుల్లో చేతివాటం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి శుక్రవారం స్పందించారు. జిల్లాకేంద్రం నుంచి వచ్చిన సరకులను తూకం వేసి మరల డీలర్లకు అందించే సమయంలో తప్పకుండా మరోసారితూకం వేస్తున్నట్లు స్పష్టం చేశారు. సరకుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించామన్నారు.

పోలీసు స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ



పాతపట్నం: రాష్ట్ర సరిహద్దు పాతపట్నం చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట: నేరాలు జరిగిన తరువాత స్పందించే కంటే ముందస్తు సమాచారం తెలుసుకుని నేరం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటే సమాజానికి ఎంతో సేవచేసినవారం అవుతామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ పరిశీలించారు. అనంతరం పాతపట్నం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. పాతపట్నం సీఐ నల్లి సాయి అలాగే మెళియాపుట్టి పోలీసుస్టేషన్ సందర్శించి నేరాలకు సంబంధించిన విషయాలను ఎస్ఐ టి.రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసుంధర అంతరాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలించారు. సారవకోట పోలీసుస్టేషన్‌ను కూడా జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి సందర్శించారు. నేర చరిత్ర ఉన్న వారి జాబితా, సిబ్బంది హాజరు తదితర అంశాలను ఆయన పరిశీలించి పలు సలహాలు, సూచనలిచ్చారు. ఏఎస్ఐ లక్ష్మీనారాయణ ఉన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆమదాలవలస: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఆమదాలవలసలోని మోనింగివారి వీధి అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ డి.సురేష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లింగ నిర్ధారణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ నుంచి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సమాజంలో ఆడబిడ్డలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హెడ్ నర్స్ భూలక్ష్మి, ఫార్మసిస్ట్ చింతాడ వరుణ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎ స్.ఎన్ స్వామి ఉన్నారు.

దోమల నివారణపై ప్రత్యేక దృష్టి

ఎల్.ఎన్.పేట: దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఎస్.సునీత, పి.ప్రియాంక అన్నారు. బొరమాంబాపురం గ్రామంలో శుక్రవారం దోమల నివారణకు ఫాగింగ్ చేశారు.

విజయవాడలో డెంగీ జ్వరం బారిన పడి చికిత్స పొంది కోలుకున్న తరువాత ఇదే గ్రామానికి చెందిన ద్రోణాద్రి మహేష్ అనే వ్యక్తి బొరమాంబాపురం గ్రామానికి చేరుకున్నాడు. ఆయనకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అయితే గ్రామంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

బావి వివాదంలో పంచాయతీకి అనుకూలంగా తీర్పు

పొందూరు: మండల కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో పంచాయతీకి, అదే వీధికి చెందిన మహిళకు బావి స్థలం విషయమై వివాదం నెలకొంది. ఈ కేసు కోర్టులో ఉంది. తాజాగా పొందూరు మేజరు పంచాయతీకి అనుకూలంగా తీర్పు వెలువడినట్లు ఈవో ఎస్.రమేష్ శుక్రవారం తెలిపారు. 2016 ఆగస్టు 15న వావిలపల్లి సుజాత పంచాయతీ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు స్థలంలో ఉన్న బావిని కొంత మంది రౌడీల సహాయంతో కూల్చి వేశారు. కాలనీ వాసులకు మంచినీరు అందించే బావిని కూల్చడంపై కాలనీవాసులు ఫిర్యాదుతో పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. దీనిపై ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసి కోర్టుకు అప్పగించారు. దీనిపై వాదోపవాదనలు జరిగాయి. స్థలం పంచాయతీకి చెందినదిగా గుర్తించడంతో తీర్పు అనుకూలంగా వచ్చింది. కోర్టు ఖర్చులతో అప్పటి పంచాయతీ ఈవో మోహన్‌బాబుకు రూ. 3 వేలు చెల్లించాలని తీర్పు ఇచినట్టు పేర్కొన్నారు.

టంగుటూరికి ఘనంగా నివాళి



నరసన్నపేట: సత్యవరం పాఠశాల్లో ప్రకాశం పంతులకు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పాఠశాలలు, కళాశాలలు, గ్రంథాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పుష్పగుచ్ఛాలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సారవకోట: టంగుటూరి నివాళులర్పిస్తున్న ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, అధికారులు



పాతపట్నం: టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేస్తున్న గ్రంథాలయ అధికారి రాజులు

ప్రజా సమస్యలు పరిష్కరించండి



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎంపీపీ మురళి

- ఉపాధి గ్రామ సభల్లో నాయకులు



సారవకోట: బుడితి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి



పాతపట్నం: ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రాలు అందజేస్తున్న దృశ్యం



సరుబుజ్జిలి: గ్రామసభలో పాల్గొన్న అధికారులు

నరసన్నపేట: మండలంలోని 34 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మేజరు పంచాయతీ నరసన్నపేటలో గ్రామ సభను శుక్రవారం సర్పంచ్ బూరల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించగా ఎంపీపీ పాల్గొన్నారు. ప్రధాన సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాని, సమస్యలు గుర్తించడంతో ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. దివ్యాంగుల శాఖ ఏడీ, నరసన్నపేట ప్రత్యేక అధికారి కవిత మాట్లాడుతూ.. స్వర్ణగ్రామాల పేరుతో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

సారవకోట: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. బుడితిలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, సర్పంచ్ పొన్నాన శంకర్, ధర్మాన తేజ్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు మెండ మురళీ, ఎంపీడీఓ రాంబాబు పాల్గొన్నారు.

అవలింగి గ్రామ సభలో తోపులాట:

సారవకోట మండలంలోని అవలింగి గ్రామసభలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు భ్రష్టు పట్టాయని స్థానిక టీడీపీ నాయకుడు అనగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దానిని వ్యతిరేకించారు. దీంతో ఇరువర్గాల మధ్యతోపులాట జరగడంతో పోలీసులు జోక్యం చేసుకొని నిలువరించారు.

కొత్తూరులో ప్రశాంతం..

కొత్తూరు: కొత్తూరు మండలంలోని 43 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రం కొత్తూరులో సర్పంచ్ పడాల కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించగా.. ఈవోపీఆర్డీ బసవ రాంబాబు పాల్గొన్నారు. అలాగే మండలంలోని 43 పంచాయతీల్లో జరిగిన గ్రామ సభల్లో 723 పనులు మంజూరు కోసం తీర్మానించారు. మండల ప్రత్యేక అధికారి, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నందొర, ఉపాధి ఏపీవో ప్రేమలత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తించిన పనులకు ప్రాధాన్యం

ఎల్.ఎన్.పేట: గ్రామ సభల్లో గుర్తించిన పనులకు ప్రాధాన్యం ఇస్తామని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్ అన్నారు. 22 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సభలను నిర్వహించారు. పండ్ల తోటలు, పొలం గట్లుపై, రోడ్ల పక్కన పండ్ల మొక్కల పెంపకం, సాగునీటి కాలువలు, చెరువులు అభివృద్ధి చేయటం, మదుములు నిర్మాణం వంటి అనేక పనులకు ప్రాధాన్యత ఉందన్నారు. ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

పొందూరు: ఎన్ఆర్ఈజీఎస్ పనుల కల్పన ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ బి.నగేష్ అన్నారు. మండల కేంద్రంలో సర్పంచ్ రేగిడి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. పొందూరు పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే కూన రవికుమార్ సహకారంతో రూ. 5 కోట్ల మంజూరు కానున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు చిగిలివల్లి రామ్మోహన్ తెలిపారు. ఎంపీడీవో హరిహరరావు, ఈవో రమేష్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగ, ఎంపీటీసీ బాడాన గిరి పాల్గొన్నారు.

ఉపయోగపడే పనులు చేయాలి

సరుబుజ్జిలి: ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉపాధి పనులు చేయాలని ఎంపీడీఓ పీవీ మురళీ మోహన్‌కుమార్ తెలిపారు. పురుషోత్తపురం గ్రామంలో ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు ఆధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, గ్రావెల్‌రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, స్థానిక నేతలు కిల్లి సిద్ధార్థ, కిల్లి లక్ష్మీగోవిందరావు, పైడి మురళీమోహనరావు ఉన్నారు.

వినతులు వెల్లువ

పాతపట్నం: ఉపాధి హామీ పథకంలో ప్రతిపాదించిన పనుల కోసం ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ప్రజలు తమ వీధులకు రహదారులు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. పాతపట్నం మేజర్ పంచాయతీలో 36 సీసీ రహదారుల పనులకు రూ.3.07 కోట్లు, 11 డ్రైనేజీ పనులకు రూ.3.58 కోట్లు ప్రతిపాదనలు జరిగినట్లు ఎంపీడీవో జయంత్ ప్రసాద్ తెలిపారు. ఏపీడీ పి.రాధ, ఏపీఓ సురేష్ పాల్గొన్నారు.

550 పనులకు ప్రతిపాదనలు

హిరమండలం: మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి 550 పనులకు రూ.25 కోట్లుతో ప్రతిపాదనలు చేపట్టినట్లు ఏపీఓ ఏ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మేజర్ పంచాయతీలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు.

25న రక్తదాన శిబిరం

ఆమదాలవలస: పట్టణంలోని ఎస్.ఎస్.ఎన్ కల్యాణ మండపంలో ఈనెల 25వ తేదీన కృత్విక్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో యువకులు, రక్తదాతలు పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంస్థ ఫౌండర్, చైర్మన్ చిగురుపల్లి వెంకటేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం పది గంటలకు శిబిరాన్ని ప్రారంభిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొందూరు: మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు తెలిపారు. దళ్లవలస ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా దల్లవలస, ధర్మపురం, పిల్లలవలస, పెనుబర్తి, అచ్చిపోలవలస, మొదలవలస, బొడ్డేపల్లి తదితర గ్రామాలకు సరఫరాను నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

ఎమ్మార్సీకి చేరిన రెండో సెమిస్టర్ పుస్తకాలు

జలుమూరు: మండలంలోని అన్ని పాఠశాలలకు మూడు నుంచి పది తరగతులకు సంబంధించి రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు 1400 వరకూ ఎమ్మార్సీకి చేరాయని ఎంఈవో బి.మాధవరావు శుక్రవారం తెలిపారు. ఉపాధ్యాయులు వచ్చి తీసుకొని వెళ్లి పిల్లలకు అందజేయాలని సూచించారు.